శంకరమంచి సత్యం స్మారక 1989 ఉగాదికథల పోటీలో రు. 200 ప్రోత్సాహక బహుమతి గెలుచుకున్న రచన

# సుబ్బారావు సిన్మాకెందుకు వెళ్లాడు?

పరేన్ ఎన్. దోషి

"దంచవే మేనత్త కూతురా! వడ్లు దంచవే నా గుండెలదర"

అద్దంలో చూసుకుని దువ్వుకుంటూ క్రితం రోజు చూసిన సిన్మాలో పాట పాడసాగాడు సుబ్బారావు.

"రవీ! తొందరగా స్నానం కానీ, టిఫిన్ చల్లారి పోతుంది?" అంటూ వంట గదిలోంచి కేకేసింది శ్యామల

"అయిపోయింది మమ్మీ" అంటూ వినిపించింది బాత్‌రూమ్‌లోంచి. "మమ్మీ, నా జడ వేసి పెట్టు. స్కూల్ టైమైపోతుంది పద్మ.

"వస్తున్నా!" కొంగుకు చేయి తుడుచుకుంటూ అంది శ్యామల.

రవికి ఎనిమిదేళ్ళు. పద్మకి ఆరు.

తొమ్మిదింటికల్లా స్కూలు కెళ్ళాలి. వాళ్ళకోసం రిక్షావచ్చేలోగా యిద్దరినీ తయారుచేసి రెడీగా వుంచాలి. సుబ్బారావు తొమ్మిదిన్నరకు ఆఫీస్‌కు వెళ్తాడు. అతని కోసం టిఫిన్ రెడీ చేయాలి! ఇన్ని పనులతో పగలంతా శ్యామల బిజీగా వుంటుంది.

"డాడీ!, ఇవాళ నా కోసం పెన్ తెస్తారు కదూ!" అంది పద్మ.

రెండు రోజుల నుంచి పద్మ పెన్ను కోసం మారాం చేస్తోంది. నీకు పెన్ను అప్పుడే ఎందుకమ్మా అంటే అస్సలు వినిపించుకోదు. అన్నయ్యకి కొన్నారు, నాకూ యిప్పించాల్సిందే అంటూ పట్టు పడుతోంది. చివరికి పెన్ను కొనక తప్పేలా లేదు.

"సరేనమ్మా" అన్నాడు సుబ్బారావు.

స్నానం చేసి, తువ్వాలు చుట్టుకొని బయటకు వచ్చాడు రవి "డాడీ నాకో మేథమెటిక్స్ నోట్సు, సింగిల్ రూల్ నోట్స్ కావాలి. మీకు నిన్ననే చెప్పాను! ఎప్పుడు తెస్తారు?" అంటూ ఫిర్యాదు చేసాడు రవి.

"సాయంత్రం తెచ్చేస్తాలేరా" అన్నాడు సుబ్బారావు పైకి లోలోపల చిరాగ్గా అనిపించింది అతనికి. రవి చదివేది మూడవ తరగతి. వారం క్రితమే వాడి కోసం మొత్తం ఖరీదైన నోట్ పుస్తకాలు కొన్నాడు. మళ్ళీ మొదలు. ఇదొక అంతులేని ప్రవాహం.

కాదంటే పిల్లలు ఊరుకోరు! తప్పదు!!

రవి, పద్మ తయారయ్యేసరికి వాకిట్లో రిక్షా వచ్చి ఆగింది. "టాటా డాడీ, టాటా మమ్మీ" అంటూ పిల్లలు బ్యాగ్‌లు పుచ్చుకొని వెళ్ళారు.

"రండి టిఫిన్ చేద్దురుగాని" అంటూ వంట గదిలోకి దారి తీసింది శ్యామల.

సుబ్బారావు ఆమెననుసరించాడు.

శ్యామల ప్లేటులో ఉప్మా, కారప్పొడి తీసికొచ్చింది.

సుబ్బారావు టిఫిన్ చేస్తుండగా ఆవిడ వేడిగా కాఫీ కలిపింది.

టిఫిన్ చెయ్యడం పూర్తయ్యాక సుబ్బారావు నెమ్మదిగా కాఫీ తాగసాగాడు.

"ఏమండీ!"

"ఊ?"

"రామనాథం వాళ్ళు గోద్రెజ్ ఫ్రిజ్ తెచ్చుకున్నారండీ! వాళ్ళు ఎంచక్కా ఐస్ క్రీమ్‌లు చేసుకోవచ్చు. ఎండా కాలంలో కూడా చల్లని నీళ్ళు త్రాగొచ్చు. పళ్ళు, కూరగాయలూ, అవీ పాడవకుండా నిలవ చేసికొనవచ్చు! అదృష్టవంతులు!"

"ఊ"

"మరి మనమెప్పుడు కొందామండీ?"

"శ్యామలా! నువ్వు చూస్తూనే వున్నావుగా? నా సంపాదనా, యింటి ఖర్చు! ఏం మిగులుతున్నాయని! ఫ్రిజ్‌కి ఎంత లేదన్నా అయిదారు వేలన్నా కావాలి. మనమెక్కడి నుండి తేగలం? నువ్వు కలలు కనడం మానేసే పరిస్థితులను ఎప్పుడు అర్థం చేసికొంటావు? ఇన్నిసార్లు చెప్పాను. మళ్ళా ఇవాళ అదే అడుగుతావ్!?" చిరాకునణచుకుని శాంతంగా అన్నాడు సుబ్బారావు.

శ్యామల మూతి ముడుచుకుంది.

"మీరెప్పుడూ అంతే! ఆ రామనాథం మాత్రం ఎంత సంపాదిస్తున్నాడేం?! ఆయనకీ మీ అంతే జీతం వస్తోంది. ఆయనకూ భార్య పిల్లలున్నారు. ఆయనెలా కొనగలిగాడంటారు? మీరు మీ సిగరెట్లూ, సిన్మాలు కాస్త తగ్గించుకుంటే మీరూ కొనగలరు బోడి ఫ్రిజ్" అంది శ్యామల.

సుబ్బారావుకి పట్టరానంతగా కోపం వచ్చింది.

శ్యామల ఆ చెంపా ఈ చెంపా వాయించాలనిపించింది.

ఈ మనిషి తననెప్పుడు అర్థం చేసుకుంటుంది? తను క్రితం జన్మలో ఏం పాపం చేసాడో, ఎలాంటి భార్య దొరికింది!' అనుకున్నాడు.

వాస్తవానికి అంత కోపం అతనికి రావటానికి కారణం అతని బలహీనత మీద ఆమె దెబ్బ తీయటం.

అదే సిగరెట్లు - సిన్మాలు.

కానీ సుబ్బారావుకి తన మీద తనకు జాలి ఎక్కువ. అందుకే తనను తాను సమర్థించుకుంటూ ఆత్మవంచన చేసుకుంటాడు.

భార్య మీద మనసులోనే కోప్పడ్డాడు కానీ పైకి మాత్రం ఏమీ అన్లేకపోయాడు.

దానికి ఒక కారణం-శ్యామల బోల్డంత కట్నం తీసుకొచ్చింది. రెండవ కారణం- తను ఒక మాటంటే, ఆమె నాలుగు అంటుంది. అర్థాంగితో వాగ్యుద్ధంలో తను గెలవలేడు!

శ్యామల ఇచ్చిన టిఫిన్ బాక్సందుకుని, ఆఫీస్‌కి బయలుదేరాడు సుబ్బారావు.


ఆ రోజు బస్సు చాలా లేటుగా వచ్చింది. సుబ్బారావుకి చాలా కోపం వచ్చింది. కానీ ఏం చేస్తాడు? నిస్సహాయుడు.

సరిగ్గెత్తి బస్సెక్కాడు. సీటు దొరక్క రాడ్ పట్టుకుని నిలబడ్డాడు.

"ముందుకెళ్ళాలి మాస్టారు!" అన్న కండక్టర్ వైపు ఒక మారు కొర కొర చూసి ముందుకి జరిగాడు.

క్షణంలో బస్సంతా నిండిపోయింది. బస్సులోకి జనం కుక్కబడ్డారు అంటే సబబుగా వుంటుందేమో!

ముందు నిలబడ్డతని వీపు చెమటతో తడిసి ముద్దయింది. ఒకటే కంపు. వెనుక నుండి జనం తొయ్యడంతో ఆ చెమట అతనికి అంటింది. చాలా చిరాకుగా వుందతనికి. ఈ నరకంలోంచి ఎప్పుడు బయటపడతానా అని ఎదురు చూస్తున్నాడతను. ముక్కు మూసుకుని, మనసుని వేరే చోట కేంద్రీకరించి ఈ నరకం నుంచి విముక్తి పొందగలను అనుకున్నాడు.



కానీ ఎంతో సేపు ముక్కు మూసుకుని వుండలేకపోయాడు. ఎంతో సేపు కళ్ళూ మూసుకుని వుండలేకపోయాడు. వెనుక నుంచి జనం తోపుడుకి, బస్సు కుదుపులకీ అతను మనస్సును మరో చోట కేంద్రీకరించలేకపోయాడు.

రోజూ వుండే నరకమే ఇది!

శుభ్రంగా తల దువ్వుకుని, పౌడర్ రాసుకుని, ఇస్త్రీ బట్టలతో బైల్దేరాడు.

బస్సు దిగేటప్పుడు ఎలావుంటుందో అవతారం?

ఆఫీస్‌కెళ్తే టైపిస్ట్ సునంద తన అవతారం చూసి నవ్వుకోదా?

మళ్ళీ చెమట కంపు!

అతనికి కడుపులో తిప్పినట్లయింది. వాంతయితే ప్రొద్దున్న తిన్న ఉప్మా ఏం కాను? కానీ వాంతి కాదు. ఎప్పుడైంది కనుక!!

ఈ త్రిశంకు స్వర్గంలాంటి పరిస్థితులు తనకు నిత్యం తప్పవు?!

బస్ లోంచి బయటకు దూకి, సిగరెట్ పీల్చి కాస్త ఫ్రెష్ అవ్వాలనిపించింది.

కానీ అది సాధ్యమా?

తన స్టాప్ ఎంతకీ రాదేం?

అప్పుడే ఎలా వస్తుంది? అరగంట ప్రయాణమైతేను!


ఇంకా ఇరవై అయిదు నిమిషాలు.

గడియారం చూసుకున్నాడు. సెకన్ల ముల్లు పన్నెండు దగ్గరికొచ్చినప్పుడు కళ్ళు మూసుకుని ఒకటి నుంచి అరవై దాకా మనసులోనే లెక్కెసుకున్నాడు. కళ్ళు తెరచి చూశాడు. సెకన్ల ముల్లు ఆరు మీద వుంది. అంటే అరక్షణం మాత్రం గడిచిందన్నమాట! మళ్ళీ...

అలా ఎలాగైతేనేం, అతని స్టాప్ వచ్చింది.

జనాన్ని తోసుకుంటూ దిగాడతను.

ఒక క్షణం నిలబడి, జేబులోంచి సిగరెట్ తీసి ముట్టించుకున్నాడు. ఒకసారి గుండెల నిండా పొగ త్రాగి వెన్ను



దిగా వదులుతూ రిలీఫ్ ఫీలయ్యాడు.

సిగరెట్ తాగుతూ ఆఫీస్ వైపు నడక సాగించాడు.

ఆ రోజు తను ఆఫీస్‌కు పావుగంట లేటు. ఆఫీసర్ ఏమైనా అంటాడేమోనని భయపడుతూ వెళ్ళాడు. కానీ ఆయనేం అనలేదు.

రిలీఫ్‌గా నిట్టూర్చి, తన సీటులో కూర్చున్నాడు. టైపిస్ట్ సునంద ఏవో లెటర్లు టైప్ చేస్తోంది.

అతను సునందవైపు చూడసాగాడు. చేతులు సన్నగా, తెల్లగా వున్నాయి. పొడవైన వేలివేళ్ళు లయబద్ధంగా కీబోర్డ్ మీద ఆడుతున్నాయి. చెవులకున్న రింగులు లయబద్ధంగా ఊగుతున్నాయి. సునంద చాలా అందంగా వుంటుంది.

అతనికి క్రితం రోజు చూసిన సినిమాలో హీరో, హీరోయిన్ డ్యూయెట్ గుర్తొచ్చింది.

అతను కలలోకి జారుకున్నాడు. ఆ కలలో తనూ, సునంద! పార్కులో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

ఆమెనో పాట పాడమని తను బతిమాలుతున్నాడు. ఆమె సిగ్గుతో తిరస్కరిస్తోంది.

"సుబ్బారావుగారూ! మిమ్మల్ని అయ్యగారు పిలుస్తున్నారు" అని ప్యూన్ పిలిచేసరికి ఈ లోకంలోకి వచ్చాడతను.

సునందవైపు చూశాడు.

టైప్ చేయడం ఆపి తనవైపే చూస్తోందామె.

రాజారావు కూడా తనవే చూస్తున్నాడు.

అతను లేచి ఆఫీసర్ గదిలోకెళ్ళాడు.

"సర్!"

"మిస్టర్ సుబ్బారావ్! మీరు మనసు లగ్నం చేసే పని చేస్తుంటారా?"

"ఎస్ సర్!"

"ఈ డ్రాఫ్ట్ చూడండి! ఏమిటిలా రాశారు?"

సుబ్బారావు తలవంచుకున్నాడు.

చెవులు వచ్చిపోయాయి.

ఆఫీసర్ ముఖం కనబడుతోంది. ఆఫీసర్ పెదాలు కదులుతున్నాయి. కానీ, తనకు వినబడ్డం లేదు.

చివరికి ఆఫీసర్ ఫైలును బల్లమీద విసురుగా పడేశాడు.

దాన్నందుకుని బైటకొచ్చాడు సుబ్బారావు.

అతని ముఖం పాలిపోయి వుంది.

రాజారావు ఏమంటున్నాడో కానీ సుబ్బారావు రాగానే చటుక్కున ఆపి తలతిప్పేసుకున్నాడు.

సునంద నవ్వుతోంది. తనను చూసేనా? ఎంత ధైర్యం!?

సుబ్బారావు హృదయంలో అవమానం భగ్గున మండింది. పిడికిలి బిగిసింది.

కానీ నిస్సహాయంగా తన సీటులో కూలబడ్డాడు. డ్రాఫ్టును సరిదిద్ది మళ్ళీ రాయసాగాడు.

అతనికి ఆఫీసర్ మీద చికాకు కలిగింది.

సుబ్బారావు స్కూల్లో చదువుతున్నప్పుడు అతనికి జయలక్ష్మి మీద 'ఇష్టం' వుండేది. ఆమె తెలివైనదీ, అందమైనదీనూ! క్లాస్‌లో టీచర్ పాఠం చెబుతుంటే తను తదేకంగా జయలక్ష్మినే చూస్తుండేవాడు. తర్వాత టీచర్ ఏదైనా ప్రశ్న అడిగితే తను జవాబు చెప్పలేకపోయేవాడు! కాలేజీలో ఆ ఇష్టం 'ప్రేమ'గా మారింది. (ఆకర్షణా? ఏమో!) జయలక్ష్మిని మాట్లాడించాలని రకరకాల వేషాలు వేసేవాడు. ఆమె చూసీ చూడనట్టుగా వుండేది!

ఆ జయలక్ష్మి ఒకసారి సినిమా థియేటర్‌లో అతనికి తారసపడింది. టికెట్ అందక వెళ్ళిపోబోతూంటే తను వెళ్ళి ఆమెకు తన టికెట్ ఇచ్చాడు. "మరి మీకో" అందామె. "అది ఎక్స్‌ట్రా టికెట్‌లెండి" అన్నాడు తను.

"థాంక్సండీ" అంది ఆమె.

తను చిరునవ్వుతో "నో మెన్షన్ ప్లీజ్" అన్నాడు. ఆమె థియేటర్లోకి వెళ్ళాక అతను బ్లాక్‌లో టికెట్ కొని వెళ్ళాడు.

ఆ విషయం ఆమెకు తెలీదు.

ఇవన్నీ గుర్తున్నాయిగానీ, ఒక్క విషయం మాత్రం అతనికి గుర్తులేదు.

అది జయలక్ష్మి అతన్ని అవమానించడం!

ఒకసారి సుబ్బారావు ఏదో వెకిలి వేషం వెయ్యబోతే జయలక్ష్మి అతడిని జాగ్రత్తగా ఉండమని గట్టిగా వార్నింగిచ్చింది. ఆ తర్వాత తను జయలక్ష్మి వెంటపడడం మానేశాడు.

ఊహాలోకాల్లో మాత్రం అతను జయలక్ష్మిని కూడా తీసుకెళ్ళి విహరించేవాడు.

అతను డ్రాఫ్టు పని పూర్తి చేశాడు.

తర్వాత లంచ్ బ్రేక్‌లో తన టిఫిన్ బాక్స్ తీశాడు.

దొండకాయ కూర!

అతనికి చిరాకు కలిగింది!

దొండకాయకూర అతనికే మాత్రం ఇష్టముండదు.

సుబ్బారావు నప్పున చేతులు కడుక్కుని లేచాడు.

ఆ తర్వాత అతని మూడ్ పాడైపోయింది.

సాయంత్రం ఆరెప్పుడౌతుందా అని ఎదురు చూడసాగాడు.

ఆఫీసు సాయంత్రం ఆరింటికి మూసేస్తారు.

ఆ తర్వాత కాళ్ళీడ్చుకుంటూ బస్ స్టాప్ దగ్గరికెళ్ళాడు సుబ్బారావు.

ఈసారి బస్ ఎంతో లేటుగా రాలేదుగానీ సగం మంది గేట్ దగ్గర వేలాడుతుండగా, గర్భిణీ స్త్రీలా నెమ్మదిగా వచ్చి ఆగింది. సుబ్బారావు జాగ్రత్తగా ఒక రాడ్‌ని పట్టుకుని ఒక కాలును ఫుట్‌బోర్డ్ మీద నిలిపి వేలాడే ఫీట్ ప్రాక్టీసు చేస్తుండగా కదిలింది.

ఇల్లు చేరేసరికి చీకటి పడింది.

భార్య వంటగదిలో ఏదో చేస్తోంది.

పిల్లలు హోం వర్క్ చేస్తున్నారు.

సుబ్బారావును చూడగానే పిల్లలు కేరింతలు కొడుతూ గెంతుతూ అరవసాగారు.

"నాన్న వచ్చారు! నాన్న వచ్చారు!!"

పోటుతో సుబ్బారావు తల పగిలిపోతోంది.

తిన్నగా వంట గదిలోకెళ్ళి భార్యను టీ పెట్టమన్నాడు.

పిల్లలు అతని వెనకే వచ్చారు.

"నాన్నా నా పెన్ను!"

"నాన్నా నా నోట్సులు!"

"నాన్నా వింటున్నావా? నా పెన్ను!"

"నా నోట్సులు!"

అంటూ ఇద్దరూ గోల చేయసాగారు.

"ఇవాళ మరచిపోయాన్రా! రేపు తెస్తాను!"

పద్మ ఏడుపు అందుకుంది.

రవి చేతిలో వున్న బ్యాగ్ గిరాటేశాడు కోపంగా.

"ఏమిటూ సని? రేపు తెస్తానన్నాగా!" కోపంగా అన్నాడు సుబ్బారావు.

"అన్నీ అబద్ధాలే!" అంటూ ముందు గదిలోకెళ్ళాడు రవి. అక్కడ బల్లమీద ఫ్లవర్‌వేజ్ అందుకుని గిరాటేశాడు.

సుబ్బారావు కోపం నషాళానికంటింది.

రవిని దబదబా బాదేశాడు.

రవి గట్టిగా ఏడుపందుకున్నాడు.

తండ్రి రుద్రావతారాన్ని చూసి పద్మ భయంతో నోరు మూసుకుంది.

సుబ్బారావు ఇంట్లోంచి బయటపడ్డాడు.

శ్యామల టీ తీసుకొని ముందు గదిలోకొచ్చేసరికి సుబ్బారావు లేడు. వెళ్ళిపోయాడు.

సుబ్బారావు ఒక హోటల్‌కెళ్ళి ముందు ఒక టీ తాగాడు. ఆ తర్వాత కాసేపు లైబ్రరీకెళ్ళి కూర్చున్నాడు.

ఎనిమిదయ్యేసరికి హోటల్‌కెళ్ళి టిఫిన్ చేసి, అక్కడ్నుంచి సినిమాకెళ్ళాడు.

నెమ్మదిగా థియేటర్ హౌస్‌ఫుల్ అయింది.

హాలంతా చీకటైంది.

ఒక్కటొక్కటే

ఎడ్వర్‌టైజ్‌మెంటు వేస్తున్నారు.

తర్వాత సినిమా మొదలైంది.

సుబ్బారావు మూడ్ మళ్ళీ ఫ్రెష్ అయిపోయింది.

పొద్దుటి చికాకులన్నీ చేత్తో తీసేసినట్టు మాయమయ్యాయి.

ఆ సినిమా — ఒక మామూలు తెలుగు సినిమా.

ఇద్దరు హీరోయిన్లు.

ఒక హీరో.

హీరో ఒక హీరోయిన్ని ప్రేమిస్తాడు. ఇంకో హీరోయిన్ మనసులోనే హీరోని ఆరాధిస్తుంది.

ఒక విలన్ మొదటి హీరోయిన్ని చెరుస్తాడు. ఆమె ఆత్మహత్య చేసుకొంటుంది. హీరో పగబడతాడు. ఫైట్లు, విలన్‌ని పోలీసులు అరెస్ట్ చేస్తారు. రెండో హీరోయిన్ తనను ప్రేమిస్తున్నట్టు తెలుసుకొని ఆమెను చేసుకుంటాడు హీరో!

ఈ సినిమాలో బోల్డన్ని పాటలున్నాయి. ఒకమ్మాయితో పార్కుల్లో, మరో పిల్లతో పొలాల్లో!!

సుబ్బారావుకి తను సునందతో కాసేపు, జయలక్ష్మితో కాసేపు డాన్స్ చేస్తూ పాటలు పాడుతున్న అనుభూతి కలిగింది.

హీరో విలన్‌ని చావబాదుతున్నప్పుడు తను తన బాస్‌ని, ఆ రాజారావుని, మరో అరడజను ఎక్స్‌ట్రాలను చితకబాదుతున్నట్టనిపించింది.

సెల్ఫ్ ఐడెంటిఫికేషన్!

సినిమా పూర్తయ్యేసరికి సుబ్బారావు మనసు మళ్ళీ ఫ్రెష్ అయిపోయింది!

భోజనం చెయ్యకపోయినా కిళ్ళీ దర్జాగా నములుతూ అతను నెమ్మదిగా ఇంటివైపు నడక సాగించాడు!

*